సాక్షి సూర్యాపేట

శుక్రవారం : 25 : ఆగస్టు : 2023



చంద్రయాన్-3లో జిల్లా వాసులు

చంద్రయాన్-3 ప్రాజెక్టు శాస్త్రవేత్తల బృందంలో ఉమ్మడి జిల్లా వాసులు కూడా పాలుపంచుకున్నారు. - 8లో



గోదాములపై దాడులు

అనధికారికంగా నిర్వహిస్తున్న పురుగు మందుల దుకాణాలు, గోదాములపై వ్యవసాయ అధికారులు దాడులు చేశారు. - 8లో



సూక్ష్మపోషక లోపాల నివారణకు..

సూక్ష్మ పోషకాల లోపాలు, నివారణ చర్యలను పెద్దవూర వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ వివరించారు. - 8లో

న్యూస్‌రీల్

మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి

చివ్వెంల(సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కోర్టులో సెప్టెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి అన్నారు. గురువారం కోర్టు ప్రాంగణంలో బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి సమయం, ధనం వృధా చేసుకోవద్దన్నారు. క్రిమినల్, సివిల్, బ్యాంకులు, గృహహింస, వెహికల్ యాక్టు కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలేబోయిన నర్సయ్య యాదవ్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో లక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కి పంచామృతాభిషేకం చేశారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. కల్యాణతంతులో భాగంగా నూతన పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగళ్యధారణ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓను బదిలీ చేయాలి



రిజిస్టర్‌లో ఏపీఓ శైలజ పెట్టిన సంతకం

హుజూర్‌నగర్‌రూరల్: అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న మండల పరిషత్ అభివృద్ధి అధికారి శాంతకుమారిని బదిలీ చేయాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఉన్న నేపథ్యంలో ఏపీఓ శైలజ శుక్రవారం విధులకు హాజరైనట్లు ముందుగానే గురువారం ఆమెతో ఎంపీడీఓ సంతకాన్ని పెట్టించినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని తాను గ్రహించకపోతే మహిళా అధికారులు సంతకాలు చేసి విధులకు రాకుండా ఉండేవారని తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్ వెంకట్రావుకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో విజేతగా నరసింహరాజు



నరసింహరాజు

కోదాడ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇటీవల హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీలలో కోదాడ నీటిపారుదల శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్ఎల్ నరసింహరాజు టేబుల్ టెన్నిస్‌లో విజేతగా నిలిచినట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన 50మంది పాల్గొన్న ఈ పోటీలలో తాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు రాజు తెలిపారు. విజేతగా నిలిచిన రాజును నీటిపారుదలశాఖ అధికారులు అభినందించారు.

దరఖాస్తులకు క్యూ..

ఎమ్మెల్యే టికెట్ కోసం గాంధీ భవన్ బాట పడుతున్న కాంగ్రెస్ నేతలు



దరఖాస్తు అందజేస్తున్న తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన భాషపంగు భాస్కర్



దరఖాస్తు సమర్పిస్తున్న భువనగిరి నియోజకవర్గ నేత పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్

- ఉమ్మడి జిల్లా నుంచి 46 మంది దరఖాస్తు
- అత్యధికంగా ఆలేరు నుంచి..
- నేటితో ముగియనున్న గడువు

సాక్షి ప్రతినిధి నల్లగొండ : అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉత్సాహం చూపుతున్నారు. తమకు అవకాశం కల్పించాలంటూ అధిష్టానాన్ని కోరుతున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు పెద్ద సంఖ్యలో గాంధీభవన్ బాట పడుతున్నారు. ఇప్పటికే 46 మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు నియోజకవర్గం నుంచి ఎనిమిది మంది దరఖాస్తులు అందాయి. గడువు ఈనెల 25 వరకు ఉండడంతో దరఖాస్తులు మరిన్ని పెరిగే అవకాశం ఉంది.

నేడు ముఖ్యనేతలు..

కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని ఇదివరకే ప్రకటించారు. ఆయన తరఫున పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి దరఖాస్తు అందజేశారు. అదే విధంగా తిప్పర్తి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తండు సైదులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ సీనియర్ నేత దుబ్బాక నర్సింహారెడ్డి శుక్రవారం దరఖాస్తు చేయనున్నట్లు తెలిసింది. ఇక నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్, ఆయన సతీమణి పద్మావతిరెడ్డి కోదాడ నుంచి పోటీ చేయనున్నారు. అందులో భాగంగానే వారు క్షేత్ర స్థాయిలో ఎప్పటి నుంచో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే టికెట్ కోసం వీరిద్దరు 25న దరఖాస్తు చేయనున్నట్లు తెలిసింది. మరోవైపు సూర్యాపేట నియోజకవర్గంలో ఇప్పటికే పటేల్ రమేష్‌రెడ్డి దరఖాస్తు చేశారు. ఆయనతోపాటు తండు శ్రీనివాస్ యాదవ్, ముషం రవి, ఎలగందుల రాము దరఖాస్తు చేశారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి శుక్రవారం దరఖాస్తు చేయనున్నట్లు తెలిసింది.



దరఖాస్తు ఇస్తున్న మునుగోడు నియోజకవర్గానికి చెందిన పున్న కైలాష్ నేత

నియోజకవరాల వారీగా..

- **నకిరేకల్** : టీపీసీసీ కార్యదర్శి కొండేటి మల్లయ్య, టీపీసీసీ ఆర్గనైజింగ్ మాజీ సెక్రటరీ దైద రవీందర్, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్ సతీమణి చెరుకు లక్ష్మి, టీపీసీసీ రాష్ట్ర నాయకుడు నల్లగాటి ప్రసన్నరాజు, యూత్ కాంగ్రెస్ నాయకుడు వేదాసు శ్రీధర్
- **ఆలేరు** : మాజీ ఎమ్మెల్యే కుడుదుల నగేష్, కల్లూరి రాంచంద్రారెడ్డి, బీర్ల ఐలయ్య, బంద్రు శోభారాణి, బోరెడ్డి అయోధ్యరెడ్డి, జనగాం ఉపేందర్‌రెడ్డి, అండెం సంజీవరెడ్డి, ఎల్లంల సంజీవరెడ్డి
- **మిర్యాలగూడ** : బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు రఘువీర్‌రెడ్డి, డీసీసీఅధ్యక్షుడు శంకర్‌నాయక్, టీపీసీసీ నాయకుడు రామలింగంయాదవ్, చిరుమర్రి కృష్ణయ్య
- **దేవరకొండ**: నేనావత్ బాలునాయక్, నేనావత్ ప్రవళిక, నేనావత్ కిషన్‌నాయక్, వడ్త్యా రమేష్‌నాయక్, కేతావత్ బిల్యానాయక్, రవినాయక్, జగన్‌లాల్‌నాయక్.
- **మునుగోడు**: చలమల్ల కృష్ణారెడ్డి, పాల్వాయి స్రవంతి, పున్న కైలాష్ నేత
- **తుంగతుర్తి** : అద్దంకి దయాకర్, వడ్డేపల్లి రవి, గుడిపాటి నర్సయ్య, బి.భాస్కర్, యుగంధర్, కృష్ణవేణి
- **భువనగిరి** : కసిరెడ్డి నారాయణరెడ్డి, పంజాల రామాంజనేయులు, పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్, తంగళ్లపల్లి రవికుమార్, పి.ప్రమోద్‌కుమార్
- **నాగార్జునసాగర్** : మాజీ మంత్రి జానారెడ్డి కుమారుడు కుందూరు జయవీర్‌రెడ్డి

కూలుతున్నా కదలడం లేదు!

- శిథిలావస్థకు చేరిన కోదాడలోని కూరగాయల మార్కెట్ భవనం
- పునాదుల దశలోనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన పనులు
- పాత భవనం వద్దే కూరగాయల విక్రయాలు సాగిస్తున్న వ్యాపారులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని అధికారులు



పాత కూరగాయల మార్కెట్ కూలే అవకాశం ఉందని బోర్డు పెట్టిన మున్సిపాలిటీ అధికారులు

కోదాడ: కోదాడలో ఏ క్షణం కూలుతుందో తెలియని శిథిల భవనంలో కూరగాయల మార్కెట్ నిర్వహిస్తున్నారు. మున్సిపల్ అధికారులు «ఈ భవనం శిథిలావస్థలో ఉంది. ఇందులోకి ప్రవేశం లేదు» అని బోర్డు కూడా పెట్టారు. కానీ వ్యాపారులు వీటిని లెక్క చేయకుండా తమ వ్యాపారాలను కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రత్యామ్నాయం చూపకుండా వ్యాపారాన్ని నిలుపుదల చేయమంటే ఎలా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూరగాయల మార్కెట్, దానికి ఆనుకొని ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ కూలే అవకాశం ఉండడంతో కలెక్టర్ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు మార్కెట్ దారులను మూసి వేసి కర్రలతో బారికేడ్లను ఏర్పాటు చేసి లోపలికి ఎవ్వరినీ వెళ్లకుండా చేశారు.

పునాదులు దాటడం లేదు..

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి సంవత్సరం క్రితం కోదాడ పశువుల సంతలో రు. 8 కోట్లతో శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పునాదులు తీసి పనులు నిలిపివేశాడు. తనకు బిల్లులు రావడం లేదని, బిల్లులు వస్తేనే పనులు చేపడతానని చెప్పడంతో నాలుగు నెలల క్రితం కొంత చెల్లించారు. మళ్లీ పనులను మొదలు పెట్టిన కాంట్రాక్టర్ బేస్ లేవల్ వరకు పనులు చేసి మళ్లీ ఆపివేశాడు. ప్రస్తుత పరిస్థితిని చూస్తే మరో సంవత్సరమైనా ఇది పూర్తయ్యే అవకాశం లేదని పలువురు పేర్కొంటున్నారు.

ఏ క్షణమైనా కూలొచ్చు..

కోదాడ మున్సిపాలిటీకి ఎదురుగా ఉన్న పాత భవనంలో గత నలభై సంవత్సరాలుగా కూరగాయల మార్కెట్ నిర్వహిస్తున్నారు. పట్టణ జనాభా 80 వేలకు పెరిగినా ఈ ఒక్క మార్కెట్ మాత్రమే ఉంది. దీని ముందు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేసి అద్దెలకు ఇస్తున్నారు. ఈ రెండు భవనాలు శిథిలావస్థకు చేరడంతో రెండు సంవత్సరాల క్రితం ఈ భవనాలను కూల్చివేయాలని అధికారులు మున్సిపాలిటీకి చెప్పారు. మున్సిపాలిటీ కూడా ఈ భవనాలను కూల్చివేసి ఆ ప్రదేశంలో నూతన మున్సిపల్ కార్యాలయాన్ని నిర్మించాలని తీర్మానం చేసింది. కానీ అద్దెలు తక్కువగా ఉండడంతో వ్యాపారులు ఈ శిథిల భవనాల నుంచి ఖాళీ చేయకుండా వాయిదా వేస్తూ వస్తున్నారు.

త్వరలో కూల్చివేస్తాం



కూరగాయల మార్కెట్ శిథిలావస్థకు చేరడంతో భారీ వర్షాలు వచ్చినపుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కలెక్టర్ ఆదేశాలతో మూసి వేశాం. త్వరలో వ్యాపారులను ఖాళీ చేయించి పాత భవనాన్ని కూల్చివేస్తాం. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం.

– మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్

సాకారం కానున్న నిరుద్యోగుల కల

నాగారం: రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామని ప్రకటించడం హర్షణీయమని స్పెషల్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొలిపాక శివకుమార్ అన్నారు. గురువారం నాగారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డీఎస్సీలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల బోధనకు 1,523 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలపడం అభినందనీయమన్నారు. ఈ భర్తీ ప్రకటనతో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న నిరుద్యోగుల కల సాకారమవుతుందన్నారు. పాఠశాలల్లో స్పెషల్ టీచర్లను నియమించడం ద్వారా దివ్యాంగ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డిలకు స్పెషల్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టికోల శ్రీనివాస్, మల్లేపల్లి యాదగిరిరెడ్డి, మిట్టపల్లి శ్రీనివాస్, లక్ష్మీనారాయణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. ఈసందర్భంగా కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. శ్రీకాంత్‌వర్మ మాట్లాడుతూ మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల కాకపోవడంతో ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అదేవిధంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకుంటే కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపడం ఖాయమన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రియాంకకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బానోత్ వినోద్ కుమార్, తాళ్ల వినయ్, క్రాంతి కుమార్, వినయ్ మహేష్, రాకేశ్, అనిల్, వెంకటేష్, శివ, నవ్య, సౌజన్య, సంధ్య, భార్గవి పూజిత, ప్రియాంక పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం చేసిన బీఆర్ఎస్



సూర్యాపేటలో నిరసన తెలుపుతున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట): ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలో బీఆర్ఎస్ బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చలమల్ల నర్సింహ ఆరోపించారు. ఈమేరకు గురువారం సూర్యాపేట పట్టణంలోని ఎంజీరోడ్డులో గల మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60శాతం ఉన్న బీసీలకు బీఆర్ఎస్ కేవలం 23సీట్లు కేటాయించిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో బీసీ విద్యార్థులు, ప్రజలు అత్యధికంగా బలిదానం చేసుకున్నారని, కానీ తెలంగాణలో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ బీసీలను అణచివేస్తుందన్నారు. సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరేళ్లుగా బీసీలకు 60 సీట్లు ఇవ్వాలని అనేక ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని, రానున్న ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వని పార్టీలకు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లు ఇప్పటికైనా బీసీలకు 50 శాతం టికెట్లు ఇస్తామని డిక్లరేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో జరిగే బీసీ సింహ గర్జన సభలో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా నాయకులు అక్కెనపల్లి జానయ్య, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు నిద్ర సంపత్ నాయుడు, కోడి లింగయ్య యాదవ్, తన్నీరు వాసుదేవ్, బైరు విజయకృష్ణ ,పల్స సైదులు, సల్ల నాగేందర్, గంగాధర జానకిరాములు, జక్కుల రామచందర్, పసల సైదులు, పగిళ్ల వెంకన్న, వడ్లమూడి కోటేశ్వరరావు, కత్రోజు సోమయ్య, తండు కృష్ణ, సుంకి వెంకన్న, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాపార్కు వద్ద ధర్నాను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ప్రదీప్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడం ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఐఎఫ్‌టీయూ) జాతీయ ఉపాధ్యక్షుడు బి. ప్రదీప్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో నిర్వహించిన ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్లుగా ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలనే కొనసాగించారని ఆరోపించారు. స్వదేశీ విధానాన్ని అమలు చేస్తామని చెప్పిన మోదీ విదేశీ విధానాన్ని వేగవంతం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. జనార్దన్, సూర్యాపేట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామళ్ల నవీన్, గంటా నాగయ్య, నల్గొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొంగరాల నర్సింహ, బొమ్మేన నాగేష్, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లా నాయకులు కొంగరి సాయిరాం, కునుకుంట్ల సైదులు, కామళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మికి ని'బంధనాలు'

- జిల్లాకు 10,800 యూనిట్లు
- కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన
- తలనొప్పిగా మారిన స్థానిక నిబంధన
- అయోమయంలో దరఖాస్తుదారులు



ఆత్మకూర్(ఎస్) మండలంలోని పాతర్లపహాడ్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే పేదలకు రూ.3లక్షల ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి నిబంధనలు అడ్డంకిగా మారాయి. ఈ నెల 9న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా 12న ముగిసింది. ప్రస్తుతం తొలి విడత సర్వే కొనసాగుతోంది. అయితే నిబంధనల ప్రకారం దరఖాస్తుదారుల వద్ద పత్రాలు లేకపోవడంతో అధికారులు తిరస్కరిస్తున్నట్లు తెలిసింది. రేషన్‌కార్డులు లేకపోవడం, స్థలం ఒకచోట ఉండి.. ప్రస్తుతం వేరొక చోట నివాసం ఉంటున్న వారి దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. కనీసం సర్వే కూడా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఇది నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వం ప్రకటించడంతో ఇప్పటికీ చాలా మంది ఆయా కార్యాలయాల్లో దరఖాస్తులు అందిస్తున్నారు.

మొత్తం 58,564 దరఖాస్తులు

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు ప్రభుత్వం 12వేల యూనిట్లను కేటాయించగా తుంగతుర్తి నియోజకవర్గం నల్లగొండ, యాదాద్రి జిల్లాలోని మండలాలకు 1200 యూనిట్లు కేటాయించారు. దీంతో జిల్లాకు 10,800 యూనిట్లు మిగిలాయి. జిల్లా వ్యాప్తంగా గృహలక్ష్మి పథకానికి 58,564 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు తొలి విడత సర్వే చేస్తున్నారు. చాలా వరకు ప్రకటనలో పేర్కొన్న ధ్రువపత్రాలు లేకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.

ఇబ్బందికరంగా నిబంధనలు..

లబ్ధిదారులు స్థానికులై ఉండాలనే నిబంధన కూడా కొంత ఇబ్బందికరంగా మారింది. చాలామంది జీవనోపాధి కోసం గ్రామాల నుంచి పట్టణాలకు వచ్చారు. అక్కడే ఆధార్‌కార్డు తీసుకున్నారు. అలాంటి వారికి చిక్కులు తప్పడం లేదు. ఉదాహరణకు సూర్యాపేట మున్సిపాలిటీ నివాస ఉంటున్న ఆత్మకూర్ (ఎస్) మండలానికి చెందిన కొన్ని కుటుంబాలకు కందగట్ల, దాచారం గ్రామాల్లో నివాస స్థలాలున్నాయి. వారి ఆధార్, ఓటరు కార్డు పట్టణంలోనే ఉన్నాయి. ఇప్పుడు వారు పురపాలికలో దరఖాస్తు చేసుకుంటే.. మండలానికి వెళ్లాలంటున్నారు. అక్కడికి వెళితే.. పురపాలిక అధికారులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఇలాంటి సమస్యను చాలామంది ఎదుర్కొంటున్నారు.

ప్రజాప్రతినిధులది తుది నిర్ణయం కావడంతో..

ఈ పథకం లబ్ధిదారుల ఎంపిక విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులది తుది నిర్ణయం కావడంతో వారు చెప్పిన వారికే కలెక్టర్ ఫైనల్ చేస్తారు. దీంతో అధికార పార్టీకి జై కొడితేనే గృహలక్ష్మి పథకం వర్తిస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎనిమిదేళ్ల కింద ప్రభుత్వం డబుల్‌బెడ్ రూం కింద రూ.7.50 లక్షలతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లు ఇల్లు నిర్మించలేక వెనక్కి తగ్గారు. ఇప్పుడు రూ.3లక్షలు ఇస్తే పేదలు ఎలా నిర్మించుకుంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పథకం ద్వారా పేదల సొంతింటి కల సాకారం అవుతుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

రెండవ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న రెండో ఏఎన్ఎంలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): తమ ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేసి, ప్రభుత్వం ప్రకటించిన కొత్త నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన రెండవ ఏఎన్ఎంలు చేస్తున్న సమ్మె గురువారం తొమ్మిదవ రోజుకు చేరింది. కాగా.. సమ్మెకు అనుమతి లేదని కలెక్టరేట్ ఎదుట వేసిన టెంట్‌ను పోలీసులు తొలగించారు. దీంతో ఏఎన్ఎంలు ఎండలోనే సమ్మె కొనసాగించారు. ఈ క్రమంలో ఏఎన్ఎం భూలక్ష్మి ఎండతీవ్రతకు సొమ్మసిల్లి పడిపోగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు లేదా అని, టెంట్లు తొలగించే హక్కు ఈ ప్రభుత్వానికి, పోలీసులకు ఎవరిచ్చారని రెండవ ఏఎన్ఎం సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లలితా బాయ్, స్వప్న ప్రశ్నించారు. సమ్మెలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు దంతాల రాంబాబు, ప్రాంతీయ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, జిల్లా గౌరవ సలహాదారులు చామల అశోక్ కుమార్, ఏఎన్ఎం నాయకురాలు అనురాధ, రూప, రాణి, మమత, సాక్షి, రజిని, గోపమ్మ పాల్గొన్నారు.



ఎండకు సొమ్మసిల్లిన రెండో ఏఎన్ఎం

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



దోసపహాడ్‌లో సంపద వనాల స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో సురేష్

పెన్‌పహాడ్: మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జెడ్పీ సీఈఓ సురేష్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగులపహాడ్, దోసపహాడ్ గ్రామాల్లోని ఎస్ఎస్పీ కాలువల వెంట సంపద వనాల స్థలాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద వనాల దగ్గర ఫెన్సింగ్ ఏర్పాటు చేసి మొక్కలు నాటడం పూర్తి చేయాలని సూచించారు. వనాల్లో అత్యధికంగా మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఎంపీఓ నరేష్, ఎస్ఎస్పీ ఏఈ పాండునాయక్, ఏపీఓ రవి, ఈసీ ఏకస్వామి, దొంగరి యుగేందర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ

గరిడేపల్లి: ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మెడలోంచి గుర్తుతెలియని వ్యక్తులు బంగారు గొలుసు చోరీ చేశారు. ఈ ఘటన గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలు.. కీతవారిగూడెం గ్రామానికి చెందిన కీత కనకమ్మ, ఆమె భర్త కీత మట్టయ్య ఇంట్లో గాఢ నిద్రలో ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి కనకమ్మ మెడలో ఉన్న నాలుగున్నర తులాల బంగారు గొలుసు ను గుంజుకొని పరారయ్యారు. బాధితులు పోలీసులకు విషయం తెలియజేయగా.. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి గ్రామానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురువారం బాధితురాలి భర్త మట్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టి వ్యక్తి మృతి

రాజాపేట: మండలంలోని జాల గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. జాల గ్రామానికి చెందిన ఎర్రోజు మల్లేశ(45) వడ్రంగి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం తన బైక్‌పై పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా.. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలంలోని ఎర్రవెల్లి సమీపంలో డివైడర్‌కు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్య గతేడాదే మృతి చెందింది.

కేవీకేను సందర్శించిన మహారాష్ట్ర ఎమ్మెల్సీ



కేవీకేలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న మహారాష్ట్ర ఎమ్మెల్సీ నీలయ్‌నాయక్

గరిడేపల్లి: మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)ను గురువారం మహారాష్ట్రలోని యావత్‌మాల్ జిల్లా శాసన మండలి సభ్యుడు నీలయ్‌నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. కేవీకేలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, ప్రదర్శన క్షేత్రాలు, ఉత్పత్తి విభాగాల కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి. లవకుమార్ ఆయనకు వివరించారు. అదే విధంగా కేవీకేలో ఉన్న భూసార పరీక్షా కేంద్రం, జీవ ఎరువుల ఉత్పత్తి విభాగం, అజోల్లా సాగు, మిశ్రమ చేపల పెంపకం, వర్మీ కంపోస్ట్, వర్మీవాష్, ట్రేలలో కూరగాయలు, పట్టుపురుగులు, పుట్టగొడుగుల పెంపకం, వరి సాగు గురించి ఎమ్మెల్సీకి శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఉన్నారు.

వివాహిత అదృశ్యం

చౌటుప్పల్: మండలంలోని నేలపట్లలో వివాహిత అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా లేపాక్షి మండలం హిందూపురం గ్రామానికి చెందిన ఎస్‌డీ సాదిఖ్ తన భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి చౌటుప్పల్ మండలంలోని నేలపట్లలో మల్బరీ తోటలో పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. చౌటుప్పల్‌లో పని ఉందని చెప్పి సాదిఖ్ భార్య ఈ నెల 19న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో సాదిఖ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంట్లో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- పోలీసులకు సమాచారం అందించిన చుట్టుపక్కల వారు
- వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సదరు వ్యక్తిని కాపాడిన పోలీసులు

గరిడేపల్లి: మానసిక స్థితి బాగోలేని ఓ వ్యక్తి తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. ఇది గమనించిన స్థానికులు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆ వ్యక్తిని కాపాడారు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెంలో చోటు చేసుకుంది. గరిడేపల్లి ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కీతవారిగూడెం గ్రామానికి చెందిన కీత వెంకటేశ్వర్లు ఒంటరిగా నివసిస్తున్నాడు. అతని మానసికస్థితి బాగోలేకపోవడంతో బుధవారం అర్ధరాత్రి 12గంటల సమయంలో తన ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్యం చేసుకునేందుక యత్నించాడు. ఇది గమనించిన చుట్టుపక్కల వారు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే స్పందించిన గరిడేపల్లి ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు, హోంగార్డు విజయ్ ఘటనా స్థలానికి చేరుకొని ఇంటి వెనుక భాగంలో ఉన్న తలుపును పగులగొట్టి ఉరికి వేలాడుతున్న వెంకటేశ్వర్లును కిందకు దించారు. అనంతరం పోలీసులు వెంకటేశ్వర్లుకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సకాలంలో స్పందించి వెంకటేశ్వర్లు ప్రాణాలు కాపాడిన పోలీసులను స్థానికులు అభినందించారు.



వెంకటేశ్వర్లు మెడకు ఉరిని తొలగిస్తున్న పోలీసులు

విద్యాశాఖ మంత్రిని కలిసిన ట్రస్మా నాయకులు

నల్లగొండ: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని గురువారం హైదరాబాద్‌లో నల్లగొండ జిల్లా ట్రస్మా నాయకులు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో వసూలు చేస్తున్న జిల్లా కామన్ బోర్డ్ పరీక్ష ఫీజు వ్యత్యాసాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రమంతా ఒకే విధమైన పరీక్ష ఫీజు అమలు చేయాలని మంత్రికి విన్నవించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. వివిధ జిల్లాల లో విద్యాశాఖ అధికారులు వసూలు చేస్తున్న కామన్ బోర్డు పరీక్ష ఫీజులో తేడాలను గుర్తించామని, త్వరలో ఒకే విధమైన ఫీజు ఉండేటట్లు చూస్తానని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో ట్రస్మా రాష్ట్ర నాయకుడు యనాల ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్. రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు, పగడాల జలంధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు జీవీ రావు, మిరియాల దుర్గాప్రసాద్, కోశాధికారి మట్ట చెన్నయ్యగౌడ్, ప్రచార కార్యదర్శులు గిరిధర్ గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, అజీజ్ పాల్గొన్నారు



మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నల్లగొండ జిల్లా ట్రస్మా నాయకులు

ఎన్యూమర్లను క్రమబద్ధీకరించాలని వినతి

నాగార్జునసాగర్: కుటుంబ సభ్యులతో కలిసి నాగార్జునసాగర్‌కు వచ్చిన నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్‌ను స్థానిక విజయ విహార్‌లో గురువారం ఎన్యూమర్లు కలిశారు. గత ముప్పై ఏళ్లుగా ఎన్యూమర్లుగా పనిచేస్తూ రిటైరవుతున్న తమను క్రమబద్ధీకరించాలంటూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో కాల్వల నిర్మాణంలో దినసరి వేతనంతో పనిచేసిన ఎన్యూమర్లను కాల్వల పనులు పూర్తికాగానే తొలగించడంతో సుప్రీం కోర్టుకు వెళ్లారని, కోర్టు ఆదేశాలు మేరకు వారిని విధుల్లోకి తీసుకున్నారని తెలిపారు. 797/87 ఉత్తర్వుల ప్రకారం అప్పట్లో కొంతమందిని క్రమబద్ధీకరించారని, 97/98 ఉత్తర్వుల ప్రకారం విధుల్లో చేరిన వారిని ఇంతవరకు క్రమబద్ధీకరించలేదు. ఏళ్లు గడుస్తున్నా ఇంకా దినసరి కూలీలుగానే పనిచేస్తున్నామని, తమను క్రమబద్ధీకరించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ముర్తుజా, రాములు, మతీన్, నాగేశ్వర్‌రావు, మహబూబ్‌అలీ, హనుమంతారెడ్డి, హరిబాబు తదితరులు ఉన్నారు.



నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎన్యూమర్లు

పురుగు మందుల గోదాములపై దాడులు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో అనధికారికంగా నిర్వహిస్తున్న పురుగు మందుల దుకాణాలు, గోదాములపై వ్యవసాయ అధికారులు గురువారం దాడులు చేశారు. ఏఓ స్వర్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మార్కెట్‌లో సరైన ధ్రువపత్రాలు లేకుండా అనధికారికంగా పురుగు మందులు అమ్ముతున్నారని బేయర్, యూపీఎల్, కార్టీవా, సింజంట పెస్టిసైడ్ కంపెనీల ప్రతినిధులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో హుజూర్‌నగర్ పట్టణంలోని సాయిబాబా థియేటర్ సమీపంలో అనధికారికంగా నిర్వహిస్తున్న రెండు గోదాములను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని సుమారు రూ.40లక్షల విలువ చేసే పలు కంపెనీల మందులు లభ్యమయ్యాయి. దీంతో గోదామును సీజ్ చేసినట్లు ఏఓ స్వర్ణ తెలిపారు. సీజ్ చేసిన పురుగు మందుల శాంపిళ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించి రిపోర్టు వచ్చిన తర్వాత జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాని ఆమె పేర్కొన్నారు. తనఖీలు ఇంకా పూర్తికాలేదని, స్టాక్‌కు సబంధించిన పూర్తి వివరాలు రేపు వెల్లడిస్తామని ఆమె చెప్పారు. కాగా గోదాములలో సుమారు రూ.2కోట్ల విలువైన పురుగు మందులు ఉండవచ్చని పలువురు పేర్కొంటున్నారు. ఈ తనఖీల్లో తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఏఈఓ నరేష్‌గౌడ్, రెవెన్యూ అధికారులు షరీఫ్, శ్రీనివాసరావు, వివిధ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పురుగు మందులను తనిఖీ చేస్తున్న ఏఓ స్వర్ణ

గొడ్డళ్లతో బెదిరింపు.. పోలీసులకు ఫిర్యాదు

వలిగొండ: మండలంలోని పహిల్వాన్‌పురంలో బుధవారం రాత్రి గొడ్డళ్లు, కర్రలతో దాడి చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బాధితులు గురువారం వలిగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పహిల్వాన్‌పురం గ్రామానికి చెందిన గొర్ల అయిలయ్య, గొర్ల పాండు, గొర్ల భారతమ్మ, తోటకూరి గోపాల్, తోటకూరి మల్లేష్, తోటకూరి ప్రశాంత్ బుధవారం రాత్రి సమయంలో అదే గ్రామానికి చెందిన గొర్ల మంజుల ఇంటిపై గొడ్డళ్లు, కర్రలతో దాడి చేసి తన భర్త, తన కొడుకును నరికి చంపుతామని బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి

చందంపేట: నేరెడుగొమ్ము మండలంలోని పలుగు తండాకు చెందిన నేనావత్ బిక్కు కుమార్తె దివ్య(13) విద్యుదాఘాతంతో మృతిచెందింది. బుధవారం రాత్రి దివ్య ఇంటి వద్ద దండేనికి వేసిన బట్టలను తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. బాలిక మృతదేహానికి గురువారం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ నివాళులర్పించారు.

దొంగకు జైలుశిక్ష

మునుగోడు: పార్కింగ్ చేసిన బైక్‌ను చోరీ చేసిన దొంగకు గురువారం నల్లగొండ జిల్లా కోర్టు జైలుశిక్ష విధించింది. ఎస్‌ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన ఐతగోని రవి జూన్ 6వ తేదీన మునుగోడులోని ఓ దుకాణం ఎదుట తన బైక్‌ను పార్కింగ్ చేయగా... చండూరు మండలంలోని బోడంగిపర్తి గ్రామానికి చెందిన కట్కూరి నరేష్ దొంగలించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ పూర్తిచేసి నిందితుడిని గురువారం నల్లగొండ కోర్టులో హాజరుపర్చగా.. స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి తగిన సాక్ష్యాధారాలు పరిశీలించి నిందితుడు నరేష్‌కు ఒక నెల 26 రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడేందుకు కృషిచేసిన ఎస్‌ఐ వెంకటేశ్వర్లుతో పాటు కోర్టు కానిస్టేబుల్ యాదయ్యని జిల్లా ఎస్పీ అపూర్వరావు అభినందించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు తప్పదు

నల్లగొండ క్రైం: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుశిక్ష, జరిమానా విధిస్తామని నల్లగొండ జిల్లా ఎస్పీ అపూర్వరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 10మందిని నల్లగొండ కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ శిరీష ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష, మిగిలిన వారికి రెండు, ఒక రోజు చొప్పున జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

ఐదు రోజులు జైలుశిక్ష

మునుగోడు: చండూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన జాల లింగస్వామి వారం రోజుల క్రితం మద్యం తాగి బైక్ నడుపుకుంటూ మునుగోడు నుంచి వెళ్తుండగా పోలీసులకు చిక్కాడు. అతడిని నల్లగొండ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు మునుగోడు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నాగిరెడ్డిపల్లిలో 'గేమ్ ఛేంజర్' షూటింగ్

భువనగిరి: మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో హీరో రాంచరణ్ నటిస్తున్న గేమ్ ఛేంజర్ సినిమా షూటింగ్ సందడి నెలకొంది. గ్రామ పరిధిలోని శ్రీభీమరావ్ రైస్ గోదాంలో రాంచరణ్ కలెక్టర్ పాత్రలో ధాన్యం, బియ్యం బస్తాలను పరిశీలించే సన్నివేశాలను చిత్రికరించారు. శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు నిర్మాతగా ఎస్‌వీసీ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రంలో కమెడియన్ సునీల్‌పై కూడా పలు సన్నివేశాలను చిత్రీకరించారు. మరో రెండు రోజుల పాటు సినిమా షూటింగ్ జరగనుంది. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు షూటింగ్ చూసేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు.

చంద్రయాన్-3 ప్రాజెక్టులో ఉమ్మడి జిల్లా వాసులు



శ్రవణ్‌కుమార్

నేరేడుచర్ల: ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 ప్రాజెక్టుకు పనిచేసిన శాస్త్రవేత్తల బృందంలో నేరేడుచర్లకు చెందిన రిటైర్డ్ సహకార సంఘం ఉద్యోగి వేనేపల్లి సత్యనారాయణరావు, లలిత దంపతుల కుమారుడు వేనేపల్లి శ్రవణ్‌కుమార్ ఉన్నారు. శ్రవణ్‌కుమార్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లాలోని శ్రీహరి కోటలో గల సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్‌లో శాటిలైట్ డిజైనర్‌గా పనిచేస్తూ బెంగళూరులోని ఇస్రో శాటిలైట్ సెంటర్‌లో ఇంజనీర్‌గా ప్రమోట్ అయ్యారు. అంతరిక్ష పరిశోధనల్లో 14 సంవత్సరాల అనుభవంతో చంద్రయాన్-3లో ల్యాండింగ్ ఆపరేషన్ టీంలో శ్రవణ్‌కుమార్ సభ్యుడిగా ఉన్నారు. 2015లో ఇస్రో ఎక్సలెంట్ అవార్డుతో పాటు 2017లో యంగ్ సైంటిస్ట్ అవార్డును కూడా అందుకున్నట్లు శ్రవణ్‌కుమార్ తెలిపారు. శ్రవణ్‌కుమార్ చంద్రయాన్-3లో ప్రాజెక్టులో పాలుపంచుకోవడం పట్ల తల్లిదండ్రులు, మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, సంతోషం వ్యక్తం చేశారు.

చందుపట్ల వాసి శంకర్ కుమార్తె..



శ్రీలేఖ

నకిరేకల్: చంద్రయాన్-3 ప్రాజెక్టులో నకిరేకల్ మండలంలోని చందుపట్ల గ్రామ వాసి కోటగిరి శంకర్ కుమార్తె కోటగిరి శ్రీలేఖ పాలుపంచుకుంది. ఐఐటీ తిరువనంతపురం(ట్రిచి)లో బీటెక్ పూర్తిచేసిన శ్రీలేఖ బెంగళూరులోని యూఆర్ రావ్ శాటిలైట్ సెంటర్‌లో శాస్త్రవేత్తగా ఉద్యోగం సాధించింది. గత 10 ఏళ్లుగా గ్రేడ్-5 సైంటిస్ట్‌గా పనిచేస్తూ చంద్రయాన్-3 ప్రాజెక్టులో ల్యాండర్ కంట్రోల్ ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్ డెస్కింగ్ ఎనాలసిస్‌లో శ్రీలేఖ కీలకంగా వ్యవహరించింది. గతంలో విజయవంతమైన అనేక ఇస్రో ప్రాజెక్టులలో శ్రీలేఖ పనిచేసిందని ఆమె తండ్రి శంకర్ తెలిపారు. చంద్రయాన్-3 ప్రయోగంలో శ్రీలేఖ కీలక భూమిక పోషించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

హాలియా వాసి..



అఖిలేశ్వర్‌రెడ్డి

రామన్నపేట: చంద్రయాన్-3 ప్రయోగం నిర్వహించిన శాస్త్రవేత్త బృందంలో నల్లగొండ జిల్లా హాలియా మండలం అల్వాల్ గ్రామానికి చెందిన పిసికె అఖిలేశ్వర్‌రెడ్డి ఉన్నారు. యాదాద్రి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భిక్షంరెడ్డి, అరుణ దంపతుల కుమారుడైన అఖిలేశ్వర్‌రెడ్డి ఐఐటీ మద్రాస్‌లో బీటెక్ చదివి, ఇస్రోలో ఎలక్ట్రికల్ డివైసెస్ యూనిట్‌లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నాడు. చంద్రయాన్-3 విజయంలో తన కుమారుడు భాగస్వామి అయినందుకు గర్వంగా ఉందని భిక్షంరెడ్డి తెలిపారు.

సూర్యాపేట వాసి..



వెంకటరమణ

సూర్యాపేట రూరల్: సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రి గ్రామానికి చెందిన చెరుకుపల్లి లింగయ్య-సరోజన దంపతుల పెద్దకుమారుడు వెంకటరమణ ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేస్తూ చంద్రయాన్-3 ప్రయోగంలో భాగస్వామి కావడం ఎంతో సంతోషంగా ఉందని గురువారం ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకటరమణ ఆస్ట్రేలియాలో ఇస్రో తరఫున 2018లో అంతరిక్ష అధ్యయనాన్ని పూర్తిచేశాడని, ఇప్పటి వరకు 55కు పైగా ఇస్రో ప్రయోగించిన రాకెట్ ప్రయోగాల్లో పాల్గొన్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

సాక్షి ఫొటోగ్రాఫర్లకు రాష్ట్రస్థాయి అవార్డులు



అవార్డు అందుకుంటున్న యాదాద్రి జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కొల్లోజు శివకుమార్



అవార్డు అందుకుంటున్న సూర్యాపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ అనుమల యాకయ్య

సూర్యాపేట, భువనగిరి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హై ఆఫ్ టెన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో సూర్యాపేట సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ అనమల యాకయ్య, యాదాద్రి జిల్లా సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కొల్లోజు శివకుమార్ రాష్ట్రస్థాయి ప్రోత్సాహక బహుమతులకు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు కేవీ రమణాచారి చేతులమీదుగా ఈ అవార్డులను అందుకున్నారు. ఇప్పటికే యాకయ్య తెలంగాణ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి మొదటి బహుమతి, శివకుమార్ రాష్ట్రస్థాయి బహుమతి పొందారు.

రుణమాఫీ పేరుతో మోసం చేసిన ప్రభుత్వం

ఆలేరురూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిందని టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన ఆలేరు మండలంలోని కొల్లూరు గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. రూ.లక్ష రుణమాఫీ చేస్తామని నాలుగేళ్ల క్రితం ప్రకటించిన సీఎం కేసీఆర్ సకాలంలో మాఫీ చేయకపోవడంతో బ్యాంకర్లు వడ్డీ కట్ చేసుకుంటున్నారని అన్నారు. గతంలో ఇచ్చిన రుణాలు కూడా అసలు మాత్రమే మాఫీ చేశారని పేర్కొన్నారు. వడ్డీని కట్ చేసుకుంటుండడంతో రైతుల చేతికి రూ.20వేలకు మించి రావడం లేదన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది రుణాలు తీసుకున్నా ఏకకాలంలో మాఫీ చేసిందని గుర్తు చేశారు. దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించిన వారికి ఆరు శాతం ఇన్‌సెంటివ్ సబ్సిడీ ఉండేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం అది కూడా ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ సర్కారు సబ్సిడీ కింద వ్యవసాయ పరికరాలు ఇచ్చిందని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకం అటకెక్కిందని విమర్శించారు. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన నాలుగేళ్లు కావొస్తున్నా ఇంతవరకు అందులోని లోపాలను సవరించలేదన్నారు. దీంతో చాలా మంది రైతులు రైతుబంధు పథకానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కొల్లూరు గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, దశరథ, మాజీ సర్పంచ్ శంకరయ్య, వెంకటేష్, గణేష్, భిక్షపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి

సూక్ష్మపోషక లోపాల నివారణతో లాభాల పంట

- పెద్దవూర మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్



సందీప్‌కుమార్, ఏఓ, పెద్దవూర

పెద్దవూర: పంటల పెరుగుదలకు ప్రధాన పోషకాలతో పాటు సూక్ష్మపోషకాల ప్రాముఖ్యత ఎంతో అవసరం. సూక్ష్మపోషకాల లోపాల వలన నేలలు చౌడుగా మారి పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది. తద్వారా రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. రైతులు ఎప్పటికప్పుడు పొలంలో సూక్ష్మపోషకాలను గుర్తించి నేలలో సాధ్యమైనంత మేర ఎరువులు వేసుకుని పంటలపై వాటి ప్రభావం ఉండకుండా చూసుకోవాలి. ముఖ్యంగా సూక్ష్మపోషకాలలో జింకు లోపమనేది సాధారణమైతే బోరాన్ లోపాలు అక్కడక్కడ కనిపిస్తాయి. జింకు లోపమనేది సాధారణంగా వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలలో ఎక్కువగా కనిపిస్తుందని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ పేర్కొన్నారు. సూక్ష్మ పోషకాల లోపాలు, నివారణ చర్యలు ఆయన మాటల్లోనే..

వరిలో జింకు లోపం

జింకు లోపమనేది సాధారణంగా వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాల(అపరాలు)లో కనిపిస్తుంది. వరిలో జింకు లోపం మెరక తీసిన పొలాల్లో, చివకని లేదా మాగని సేంద్రీయ పదార్థం వేసిన నేలల్లో, చౌడు ఉప్పు నేలల్లో, భాస్వరం ఎరువు ఎక్కువ మోతాదులో వేసిన పొలాల్లో కనిపిస్తుంది. జింకు లోపం ద్వారా వరిలో నాటిన 2 నుంచి 4 వారాల్లో మొక్కపై నుంచి 3 లేదా 4వ ఆకు నడుమ ఈనె తెల్లగా పాలిపోతుంది. ఆ తర్వాత ఆకు కొనభాగం ఆకుపచ్చ రంగులోనే ఉండి ఆకు మధ్య భాగంలో ముదురు ఇటుక రంగు మచ్చలు ఏర్పడతాయి. కొన్నిసార్లు ఏవిధమైన లోప లక్షణాలు కనిపించకుండా



పాడి పంట

నత్రజని, భాస్వరం ఎరువులు తగినంతగా వేసినప్పటికీ పైరు ఏపుగా పెరగదు. మొక్కజొన్నలో జింకు లోపం వల్ల లేత ఆకుల్లో నడుమ ఈనెకు సమాంతరంగా తెలుపు లేదా పసుపు చారలు ఏర్పడి, మొక్క గిడసబారి ఉంటుంది. లోపం తీవ్రత ఎక్కువైనప్పుడు ఆకులు ఎరుపు రంగులోకి మారి ఆకుపై మచ్చలు ఏర్పడతాయి. అపరాలలో జింకు లోపం వలన మొక్కలు గిడసబారిపోయి లేత ఆకుపచ్చ మచ్చలు వచ్చి ఆకులు చిన్నవిగా మారి కణుపులు దగ్గరగా ఉండి మొక్క గుబురుగా ఆలస్యంగా పెరుగుతుంది.

నివారణ ఇలా..

సాధారణ నేలల్లో మూడు పంటలకు ఒకసారి, కొత్త ఆయకట్టు కింద సాగు చేసే నేలల్లో, చౌడు, ఉప్పు నేలల్లో రెండు పంటలకు ఒకసారి ఎకరాకి 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. పైరు మీద జింకు లోపం గమనిస్తే లీటరు నీటికి 2గ్రాముల చొప్పున జింక్ సల్ఫేట్ కలిపి ఆకులు మొత్తం తడిసేలా ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని 2-3 సార్లు 5 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. వరి తరువాత వరి పండించే నేలల్లో ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేట్‌ను ప్రతి పంటకు ముందు వేసి జింకు లోపాన్ని నివారించవచ్చు.

ఇనుము లోపం

జింకు తర్వాత ఇనుము లోపం ప్రధానమైనది. ఈ లోపం అక్కడక్కడా మట్టి నమూనాల్లో గమనిస్తాం. ఇనుము లోపం సున్నం అధికంగా ఉండే నేలల్లో లేదా సాగునీటిలో కార్బొనేట్లు, బైకార్బొనేట్లు అధికంగా ఉండే సందర్భాలలో కనిపిస్తుంది. ఇనుము లోపం వరిలో మెట్ట నారు మడుల్లో, నీటి ఎద్దడి ఉన్నప్పుడు ఆకుల ఈనెల మధ్య భాగం పత్రహరితాన్ని కోల్పోయి పసుపుగా మారుతుంది. లోపం తీవ్రమయ్యే కొద్దీ ఆకు క్రమంగా పాలిపోయి తెల్లగా మారి ఎండిపోతాయి. ఇతర పంటల్లో కూడా ఇదే విధమైన లక్షణాలు ప్రధానంగా లేత ఆకుల్లో కనిపించి మొక్క పెరుగుదల కుంటుపడుతుంది.

నివారణ ఇలా..

ఇనుము లోపం గ్రహించినప్పుడు లీటరు నీటికి 10 గ్రాముల అన్నభేదిని ఒక గ్రాము నిమ్మ ఉప్పుతో కలిపి మొక్క మొత్తం తడిసే విధంగా వారం, పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయడం ద్వారా లోపాన్ని నివారించవచ్చు.

సేంద్రీయ ఎరువుల వాడకం

రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకంపై మొగ్గు చూపడం వల్ల భూమిలో సూక్ష్మపోషకాల లోపాన్ని అరికట్టడానికి ఆస్కారం ఉంటుంది. నేలలోనే కాకుండా పంటపై కూడా లోపాలను సరిచేసుకోవచ్చు. రసాయన ఎరువులు మితిమీరి వాడటం వలన భూమిలో సారం తగ్గిపోతుందనేది రైతులు గమనించాల్సి ఉంటుంది. సేంద్రీయ ఎరువుల వాడకం వలన పంటకే కాకుండా పర్యావరణానికి ఎలాంటి ముప్పు ఉండదు. అంతే కాకుండా రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించటానికి దోహదం చేస్తుంది.

బోరాన్ లోపం..

వరిలో బోరాన్ లోపం వల్ల లేత ఆకులు వంకర్లు తిరిగి ఆకులు ఎండిపోతాయి. నేలల్లో బోరాన్ ఎక్కువైనప్పుడు ఆకులపై చివరన మచ్చలు వచ్చి ఎండిపోతాయి. నేలల్లో బోరాన్ లోప స్థాయి లేదా విషమ స్థాయి మధ్య వ్యత్యాసం తక్కువ కావున బోరాన్ లోపం నిర్ధారించిన తర్వాత మాత్రమే నేలలకు లేదా పంటకు బోరాన్‌ను అందించాలి. పత్తి పండించే నేలల్లో కూడా బోరాన్ లోపం కనిపిస్తుంది. పొద్దు తిరుగుడు, వేరుశనగ పంటల్లో బోరాన్ లోపం అనేది సర్వసాధారణం.

నివారణ ఇలా..

పత్తిలో బోరాన్ లోపం నివారణకు ఎకరాకు 2 కిలోల బోరాక్స్‌ను ఆఖరి దుక్కిలో వేయటంతో పాటు రెండుసార్లు 0.15 శాతం బోరాక్స్‌ను 60 లేదా 90 రోజులకు పిచికారీ చేయాలి. పొద్దు తిరుగుడు పూలల్లో మధ్యభాగం గింజ కట్టదు. వేరుశనగలో గింజ మధ్యభాగం తొడుకోదు. ఈ లోపాన్ని సవరించటానికి 0.1 శాతం బోరిక్ ఆమ్లాన్ని ఒక లీటరు నీటికి కలిపి పైరు వేసిన 30-45 రోజుల తరువాత రెండుసార్లు పిచికారీ చేయాలి.